

# బతుకుతున్న శవం

నాలుగైదేళ్ళ క్రితం వోనాడు పరమేశం చచ్చిపోయాడు. ఆనాటి నుంచి బతుకుతున్నది అతని శవమే కాని అతను మటుకు కాదు.

* * *

గాలితో పాటు కదులుతూ పెద్దగా మండుతోంది తోపుడు బండి మీది కిరసనాలు దీపం. మండుతున్న దీపం లావాటి వొత్తి చుట్టూ పల్చటి రక్తపు ఆవిరిలా ఉంది వెలుగు. ఆ వెలుగులో నిల బడున్నారు వాళ్ళు.

మధ్య మధ్యలో వాళ్ళని చూస్తూ, చిన్న కత్తితో మిరప కాయ బజ్జీల్ని గబగబా ముక్కలుగా కోస్తున్నాడు పరమేశం, ఉప్పు, కారం....మసాలా గ్లాసుల చుట్టూ చిత్రంగా పరిగెడుతున్నాయి అతని చేతులు, ఆ హడావిడి ఆ చేతులకి, వేళ్ళకి రోజూ అలవాటే....

అంత తొందర్లో కూడా అతని చూపులు చీకట్లోంచి దూసుకుని వాళ్ళని పలకరిస్తాయి. పెదాలు నవ్వుతాయి.... మెదడు వ్యాపారం చేస్తుంది. మనస్సు వాళ్ళు చెప్పే మాటల వెనుక బతుకుల చుట్టూ తిరుగుతోంటుంది.

కొంటానికి వచ్చేవాళ్ళలో చాలా మంది తరచుగా పరమేశానికి

కవిపించే వాళ్ళే. కొంత మంది రోజూ కవిపిస్తారు. ఇలా రోజూ కవిపించే వాళ్ళలో కొంత మంది బతుకులు పరమేశానికి బాగా తెలుసు.

కొబ్బరి చిప్పలోంచి ఉప్పు, కారం, ఉల్లి పాయ ముక్కలు కలిపిన బజ్జీ ముక్కల్ని కాయితంలో పోస్తూ వాళ్ళ వేపు చూశాడు పరమేశం.

రోజంతా పనిచేసిన జిడ్డుతో నల్లబారిన వాళ్ళ ముఖాల మీదికి దీపం వెలుగు ఎర్రగా పాకుతోంది. వాళ్ళల్లో ఇద్దరు బండి వేపు చూస్తున్నారు. మిగిలిన ఇద్దరి ముఖాలు సగంపైగా చీకట్లో ఉన్నాయి. వాళ్ళెటు వేపు చూస్తుంటారో పరమేశానికి తెలుసు. వోసారి వోరగా తల తిప్పి అటు చూశాడు.

బండి దగ్గర్నించి యాభై గజాల దూరం కూడా ఉండదా పాక. అందులో ఇంకా హడావిడి అంతగా కనపళ్ళేదు పరమేశానికి. పాక వసారాలో వెలుగుతున్న మూడు పెట్రోమాక్స్ లైట్ల కాంతి మనుషుల్ని వెతుక్కుంటోంది. చెదురు మదురుగా కూచుని తాగుతున్న ఆ పది పదిహేను మందికి కావల్సిన దానికన్నా ఎక్కువ వెలుగే తిరుగుతోంది అక్కడ....

ఆ వెలుగులో.... పెద్ద పొడుగాటి కల్లు బుడ్లు....గుడంబా గ్లాసులు అటూ ఇటూ నడుస్తున్నాయి.

తాగుతున్న వాళ్ళని గుర్తుపట్ట గలిగే దూరంలోనే ఉంది పరమేశం బండి. బండి దగ్గర పని అయిపోతే అక్కడికే వెడతారు పీళ్ళూను. పరమేశానికి కొత్త కాదు వాళ్ళ తొందర, హడావిడి... వాళ్ళ చూపుల్లో కల్లు కదుల్తూంటుంది....గుడంబా అలవాటు ఎర్రగా మెరుస్తూంటుంది.

నలుగురూ వెళ్ళిపోగానే బండి కింద చెక్క మీంచి మరి కాసివి బొగ్గులు తీసి మూకుళ్ళో నిప్పుల మీద వేశాడు పరమేశం. కొత్త బొగ్గుల్ని రాజేస్తూ మళ్ళీ పాకవేపు చూశాడు.

కొత్తగా వెళ్ళిన నలుగురూ అందుకుంటున్న తెల్లటి కల్లు బుడ్లు అక్కడి వెలుగులో నీలం అంచుల్తో మెరిశాయి. పాకంతా వెతికినా పరమేశానికి ఎల్లయ్య కనపడ్లేదు.

పాక మీంచి చూపు మరల్చి రెండో వేపు చూశాడు.

ఆ వేపు రోడ్డు ఓ వంద గజాల్లో చిన్న ఎత్తెక్కి పాన్ డబ్బీ దగ్గర పెద్ద వీధిలోకి మలుపు తిరిగి....సిటీ బస్సుల గొడవలో,సినిమా హాలు సందడిలో కలుస్తుంది. వీధిలోకి ఎవరు వస్తున్నా మలుపు దగ్గర్నించి కనిపిస్తారు. పాన్ డబ్బీ లైటు వెలుగు మలుపు దగ్గరే వాళ్లెవరో చెపుతుంది.

కల్లుపాకకి ఎంత మంది జనం వచ్చినా ఎల్లయ్య రానంత వరకూ ఇంకా రావల్సిన వాళ్ళు చాలా మంది ఉన్నట్టే అనిపిస్తుంది పరమేశానికి. పెద్దగా పనేం ఉండక పోయినా వచ్చే వరకూ ప్రతి రోజూ ఎల్లయ్య కోసం ఎవరు చూస్తూనే ఉంటాడు.

వీధి మలుపు వేపు రెండు నిముషాలు చూసినా రోడ్డు దాటే లారీలు, బస్సులు తప్ప ఎవ్వరూ వస్తున్న జాడ కనిపించలేదు. బండిలోంచి బేసిన్ తీసి నిప్పులు మూకుడికి అందుబాట్లో పెట్టుకున్నాడు. బొగడ పువ్వుల్లాంటి చిన్న చిన్న మాంసం ముక్కలు గుచ్చిన పొడుగాటి పుల్లలున్నాయి బేసిన్‌లో....రెండింటిని తీసి నిప్పుల వేడిమీద పెట్టాడు.

నిప్పుల వేడి షల్లల అంచుమీద పాకేటప్పటికి పచ్చిమాంసం కాలుతున్న కపురు వాసన ఘాటుగా లేచింది పైకి.ప్రతిరోజూ ఆవాసన ఒకసారేనా ఎల్లయ్యని గుర్తు తెస్తుంది.

కోల ముఖం,చిన్న కళ్ళు, ఓ చెవుకి వెండి పోగు, పై పెదాన్ని కప్పుతూ నిండుగా మీసాలు, తలపాగా....ముతక పంచ....ఎల్లయ్య ఆ పాకకి తాగటానికొచ్చే అందరి లాటి వాడే. కాని పరమేశం దృష్టిలో మటుకు కాదు. దాని క్కారణం పరమేశానికి బాగా తెలుసు. ఎల్లయ్య వల్ల తను బాగుపడ్డాడు.

పెద్ద వీధిలో పాన్ డబ్బీ పక్కగా ఉండే పరమేశం బండిని కల్లుపాక దగ్గరికి మార్చి చూడమని సలహా ఇచ్చింది ఎల్లయ్యే. అందరిలాగే ఎల్లయ్యా కొనుక్కోటానికి వచ్చిన వాడే. ఏదో మాటల్లో ఆ సలహా చెప్పాడు. అది బాగా ఉపయోగపడింది పరమేశానికి.

కల్లు పాక దగ్గర అమ్మకం పెద్ద వీధిలో అమ్మకం కన్నా రెట్టింపు ఉంటుందని మొదటి రోజే తెలిసింది పరమేశానికి. పాక దగ్గర పోటీగా ఇంకో బండి లేకపోవటం తన అదృష్టం అనుకున్నాడు. ఆ రకంగా కల్లు పాకలోకి వచ్చే వాళ్ళలో మొదటి పరిచయస్థుడు ఎల్లయ్య.

కాలిన రెండు పుల్లల్ని పక్కన పెట్టి, వీధివేపు మళ్ళీ చూశాడు పరమేశం. ఎవరో మలుపు తిరిగారు ..ఒక్కక్షణం మలుపు వెలుగులో మెరిసిన ఆ ఆకారం ఎల్లయ్యలాగే తోచి అటువేపే చూస్తూ ఉండిపోయాడు.

బండి వెలుగులోకి వచ్చాక తెలిసింది....ఎల్లయ్య కాదు.... వచ్చింది మల్లన్న. ఇద్దరి వొడ్డూ, పొడుగూ ఒకటే....ఇద్దరూ నడి వయసువాళ్ళే....తేడా అల్లా మల్లన్న ముఖం మొద్దుగా ఉంటుంది. నల్లటి ముఖంలో కనుబొమ్మల నలుపు ఎక్కువగా కనపడదు, వాటి కింద అ స్తమానం మూసుకు పోతున్నట్టుండే అతని కళ్ళు కాస్సేపైనా దేన్నీ స్థిరంగా చూడవు.

మల్లన్నని చూసి పలకరింపుగా నవ్వాడు పరమేశం. బదులుగా మల్లన్న కూడా నవ్వుతూ ఓ రెండు చీకులు, పావలా బజ్జీలు కావాలన్నాడు.

అప్పుడే కాలిన రెండు చీకుల్ని. పావలా బజ్జీల్ని కాయితంలో కట్టి పరమేశం ఇస్తుంటే....మల్లన్న మళ్ళీ నవ్వాడు. నవ్వి "పైసలు రేపిస్తాలే పరమేశం...." అన్నాడు. పరమేశం జవాబు చెప్పే లోపలే మల్లన్న రెండడుగులు ముందుకేసి, మళ్ళీ అడుగు వెనక్కేసి.

"రేపో కొత్త యాపారం చెప్తా....ఓ పది రూపాయలు తీసి కరా....మరిచిపోకు...." అంటూ వెళ్ళిపోయాడు.

కొత్త వ్యాపారం అన్నమాట గాలిలో కలిసి పరమేశం చుట్టూ బలంగా అల్లుకు పోయింది. తనలోసాగే ఆలోచన ఏదైనా యాంత్రికంగా కదిలే పరమేశం చేతులు. వేళ్ళు ఒకటి రెండుక్షణాలు కదలకుండా ఆగిపోయాయి ..."కొత్త వ్యాపారమా...." అనుకున్నాడు. అలా అనుకుంటుండగానే పరమేశం ఆలోచన మల్లన్న మీదకి మళ్ళింది.

కొత్త వ్యాపారం అన్నమాట ఎల్లయ్యనుంటే యింత తబ్బిబ్బు ఉండేది కాదు పరమేశానికి. మల్లన్న నోటమ్మట ఆ మాట ఆశ్చర్యంగానే ఉంది. మల్లన్న సంగతి బాగా తెలుసు.

ఆ కల్లు పాక దగ్గర కొచ్చే అందర్లాగా వాళ్ళలవ నిచ్చే మనిషికాదు మల్లన్న. తెల్ల బట్టలాళ్ళ దగ్గర హోదా ముసుగు పెద్ద మనుషుల దగ్గర తొత్తులా తిరిగి సంపాదిస్తాడు. వాడికబురు వీడికి... వీడి కబురు....ఇంకోడికి...,ఇంకొకడి కబురు మరొకడికి చెప్పి పొట్ట గడుపుకోవటం మల్లన్న వృత్తి. మరీ అవసరమయితే ఉత్తి కబుర్ల తోనే కాకుండా చేతల్తో చిల్లర పనులు చెయ్యటానికి వెనకాడని మనిషి.

కాని కల్లుపాక దగ్గరకొచ్చే అందర్లోకి జల్సాగా ఉండేది మల్లన్నే. ఇంచుమించు ప్రతి రోజూ వస్తాడు,... తాగుతాడు, తింటాడు. తూలుతూ వెడతాడు ...ఇంకోడి గొడవ సాధారణంగా పట్టించుకోడు. అలాంటి మల్లన్న కొత్త వ్యాపారం అనేటప్పటికి తబ్బిబ్బుగా ఉంది పరమేశానికి, ఆ తబ్బిబ్బు ఆలోచనని. పనిని సాగ నివ్వలేదు చాలా సేపు.

అటువంటి స్థితిలో ఎల్లయ్య రావటం ఎంతో తేలిగ్గా అనిపించింది. జరిగింది చెప్పి....

"ఏం వ్యాపారమో....ఏమిటో....ఏం చెయ్యమంటావు" అన్నాడు.

అంతా విని...."నీ దగ్గర పైన ఉన్నాయా?...." అన్నాడు ఎల్లయ్య.

ఉన్నాయన్నట్టు తలూపాడు పరమేశం.

"అయితే రేపు తీస్కరా, మల్లన్నగాడి బుద్ధి సరైంది కాక పోయినా. బుర్ర గట్టిది....ఏ మంటాడో సూద్దాం....ఇప్పు డడుగుతా అణ్ణి ఏంటో అది, రేపు అదికన్నా ముందొచ్చి నీకు ఏ సంగతి చెప్తా..." అన్నాడు.

ఎల్లయ్య వెళ్ళిపోయినా కొత్త వ్యాపారం ఆలోచన వదల్లేదు పరమేశాన్ని.

ఆ రోజుకి కల్లు పాకలో సందడి తగ్గాక. బండి సరుకుని ఇంటివేపు బయల్దేరే వరకూ పరమేశానికి మధ్య మధ్యలో గుర్తొస్తునే ఉన్నాయి మల్లన్న మాటలు. తనకి తెలియకుండానే రోజుకన్నా తొందరగా తోశాడు బండిని ఆ రోజు.

బండి పాన్ డబ్బీ మలుపు తిరుగుతుండగా..."ఈ పాటికి ఎల్లయ్య మల్లన్ననడిగి కొత్త వ్యాపారం మంచి చెడ్డలు కనుక్కునే ఉంటాడ్లే...." అనుకున్నాడు...అలా అనుకుంటుండగానే ఆ రోజు గుర్తొచ్చింది.

ఆ రోజు...

ఎల్లయ్యే చెప్పాడు బజ్జీల్తోపాటు చీకులు కూడా అమ్మకానికి పెట్టమని.., అవి ఎలా ఉంటాయో కూడా పరమేశానికి తెలియదు. వాటి సంగతంతా వివరంగా చెప్పింది ఎల్లయ్యే.

అలా చెప్పిన మూడోనాడు పరమేశం మొదటిసారిగా బండి మీద చీకులు అమ్మకం మొదలెట్టాడు, ఆ రోజు తెచ్చినవన్నీ అయిపోయాయి. "మందులోకి ఏది మజాగా ఉంటదో నీకు తెలిసిందే..," అన్నారు పాక కొచ్చే వాళ్ళు. గొప్ప అదృష్టం కలిసొచ్చి నట్టనిపించింది పరమేశానికి, వరసగా మూడు రోజులు చూశాడు...అమ్మకం ఏం తగ్గలేదు. చీకులతో వ్యాపారం ఇదివర కటికంటే బాగా లాభసాటిగా ఉంది. నాలుగోనాడు పెళ్ళానికి ఎర్ర పూల జాకెట్టు కొన్నాడు. కొని ఇంటికి తీసికెడుతూ-"లక్ష్మి వాటి

పిచ్చిది. తనకేం కావాలో కూడా గట్టిగా నోరు తెరచి అడగలేదు" అనుకున్నాడు.

లక్ష్మికి ఉన్న చీరలన్నిటిలోకి ఎర్రచీరే మంచిది. దాని మీద ఆ రంగుకి సరిపోయే ఎర్ర జాకెట్టు వేసుకోవాలన్నది తనకి పెద్ద కోరిక. ఒకటి రెండుసార్లు పరమేశంతో నెమ్మదిగా నసిగింది ఆ విషయం.

లక్ష్మిని ఎర్ర జాకెట్టు, ఎర్ర చీరలో తృప్తిగా చూశాడు పరమేశం. ఆ రాత్రి అతని మనసు కళ్ళల్లోచేరి భార్యతో కలిసి సంతోషంగా ఇల్లంతా కలయ తిరిగింది....ఎన్నో కబుర్లు చెప్పాడు. సహజంగా ఎక్కువ మాట్లాడని లక్ష్మిచేత ఏవేవో మాట్లాడించాడు.

సాయంత్ర మయ్యేటప్పటికి భార్యని ఆ ఒక్కరోజే ఎన్నో వేలసార్లు పిలిచినట్టనిపించింది పరమేశానికి...అదో సంతోషం,...ఆ సంతోషంలో ఎన్నో ఆశలు మెరుస్తూ కనిపించాయి. ధైర్యం కలిగింది...,కొత్త జాకెట్టు, కోడికూరలాంటి చిన్న చిన్న ఆశలకి తన బతుకులోను చోటుంటుందని...

ఆనాటి ఆ ఆనందం గుర్తొచ్చేటప్పటికి పరమేశం ఆలోచనలో లక్ష్మి చేరి నవ్వింది.,..,ఆ నవ్వు మరింత తొందరగా నడిపించింది పరమేశాన్ని.

• • • •

ఆ మర్నాడు పరమేశం కన్నా అతని ఆతృతే ముందు కల్లు పాక చేరింది. ఎల్లయ్య రాకకోసం రోజుకన్నా ఎక్కువగా ఎదురు చూశాయి అతని చూపులు.

ఎల్లయొచ్చి అంతవరకు తన ఆలోచనకి అందని గొప్ప చిత్రమైన వ్యాపార విషయం ఏదో చెపుతాడని, దాన్ని గురించి తనెంతో తర్జన భర్జన పడాలని పరమేశంలో చూచాయగా ఓ ఉద్దేశం ఏర్పడింది.

గంట ఎదురు చూసిన తర్వాత ఎల్లయ్యొచ్చి "మల్లన్న వో వెండి వస్తు విస్తాడు, పది రూపాయిలియ్యి. నెల తిరక్కుండా పదమూడు రూపాయి లిస్తాడు...అప్పుడు తిరిగి అది వస్తువు అది

కిచ్చేయి..." అన్నాడు.

ఎల్లయ్య చాలా తాపీగా తేలిగ్గా చెప్పిన ఆ మాటల్ని ఒకటికి రెండుసార్లు మనసులో గుణించుకున్నా, ఏం జవాబు చెప్పాలో తోచ లేదు పరమేశానికి. చివరికి...."నేల తిరక్కుండానా"అన్నాడు. అదీ అనాలని అనలేదు.

"అవును....నెల తిరక్కుండానే తీసుకుంటా నన్నాడు.... దాటితే మటుకు నీకేం....మరో మూడు రూపాయలు వడ్డీ ఇస్తాడు.... అన్నాడు ఎల్లయ్య తిరిగి.

ఎల్లయ్య కల్లు పాకలోకి వెళ్ళిపోయాక్కూడా చాలాసేపు పర మేశానికి ఆలోచన తెగలేదు. కొత్త వ్యాపారం మంచి చెడ్డల్ని గురించి జాగ్రత్తగా ఆలోచించాలనుకున్న పరమేశానికి చిత్రమైన అయోమయం ఆవరించింది. చివరికి...."ఇదెప్పుడు తన దృష్టికి రాని వ్యాపారం"....అని మటుకు అనుకోగలిగాడు....

చీకటి చిక్కగా కమ్ముకుంటుండగా మల్లన్నొచ్చాడు. ఇద్దరూ పెద్దగా ఏం మాట్లాడుకోలేదు. జేబులోంచి ఆడాళ్ళ కాళ్ళకి పెట్టుకునే పట్టీ గొలుసు తీసిచ్చాడు మల్లన్న. ఇస్తూ...."అంతా ఎల్లయ్య చెప్పాడా ,..." అన్నాడు.

చెప్పాడన్నట్టు తలూపుతూ పరమేశం పది రూపాయలిచ్చాడు, ఇస్తున్నప్పుడు చెయ్యి కొద్దిగా వొణికింది. ఆ చేత్తోపాటు మనిషి కూడా వణికాడు. మల్లన్న ఇంకేం మాట్లాడలేదు. బజ్జీలు కట్టించు కున్నాడు....చీకులు తీసుకున్నాడు....వెళ్తూ వెళ్తూ....

ఎందుకు బయపడ్డావట....కొడితే బాగా ఉన్నోణ్ణికొట్టి పీలాటి నలుగురు లేనోళ్ళకి పెడతాకాని, నిన్ను పాడు చేస్తానా....బయపడకు అంటూ వెళ్ళిపోయాడు.

పెద్ద బరువు కాకపోయినా చేతిలో ఉన్న పట్టీ గొలుసు బరు వుగా ఉన్నట్టనిపించింది పరమేశానికి. నెమ్మదిగా, జాగ్రత్తగా డబ్బుల పెట్టెలో పెట్టాడు. పెడుతుండగా కిరసనాయిలు దీపం వెలుగులో ఆ పట్టీగొలుసు మెరిసిన ట్టనిపించింది.

అంతే....ఆ మెరుపులోంచి మొదటిసారిగా అతనిజీవితంలోని ఆనందపు ఆయువు పట్టుమీద చావుదెబ్బ తగిలింది.

ఆ తర్వాత ఆ బండి దగ్గరికి, పరమేశం చేతిలోకి ఎన్నో మట్టెలు, కడియాలు....పోగులు....దుద్దులు, పుస్తెలు, బతుకులు చాలా చాలా వచ్చాయి. ఎన్నో మెరుపులు మెరిశాయి.

ఏళ్ళతోపాటు ఆ దెబ్బ బలాన్ని పుంజుకుని ఓనాడు పరమేశాన్ని పూర్తిగా చంపేసింది. ఆ రోజు నుంచి బతుకుతున్నది అతను కాదు.

అతని కిప్పుడు ఇదివరకటిలా సంతోషం లేదు. రోజు రోజుకీ తను ఆర్థికంగా బలపడుతున్నానన్న ఆనందం లేదు. ఉన్న దొక్కటే....వ్యామోహం.

ఇది వరకు వ్యాపారం ఒక్కోమెట్టే పెరుగుతుంటే పరమేశం ఆశలు గంతులు వేసేవి. ముఖావంగా, అమాయకంగా ఉండే భార్య కోరికల్ని తీరుస్తున్న తృప్తి. రాబోయే రోజులు బాగుంటాయన్న ఉత్సాహం ముందుకి నడిపించేవి. ఆనాటి పరమేశం మనసుకి జీవితంలోని అందాన్ని గుర్తించే చూపుండేది. స్పందించే గుణం ఉండేది.

నాలుగేళ్ళనుంచి శవంలా బతుకుతున్న పరమేశాని కిప్పుడు... మంచి వడ్డీ వ్యాపారం ఉంది... సొంత ఇల్లుంది... అద్దెకి తిర్గే వది బజ్జీల బళ్ళున్నాయి. పెళ్ళామనే ఆస్తుంది.

కాని సంపాదనని అనుభవించే చొరవ, జీవం ఉన్న మనసు మటుకు లేవు....అంతే....

('ఆంధ్ర జ్యోతి')లో ముద్రితము